వంశపావనుడగు తనయుడు.

[ఒకకల్పితకథ.]

మహారాష్ట్రులకును, ఆంధ్రులకును సంవత్సరాది పండుగ ఒక్కటే. హైందవులలో ధనాఢ్యులు వెళ్ళి భుజించునొక సుప్రసిద్ధభోజనశాలకు దాము దొరలు కాకపోయినను, గావలయునని కోరు కొందరు పెద్దమనుష్యులు వెళ్ళియుండిరి. వారి యాశ సంవత్సరాది భోజనము నిచ్చుట బ్రాందివైనులతోను, మాంసాహారముతోను జేయవలయుననియే. అచ్చటనున్న దొరలు, దొరసానులు పెద్దలు, పిన్నలు సొగసైన విలువగలవస్త్రములనుధరించి తమ జన్మాధిక్యతనో, విద్యాధిక్యతనో రెండును లేనప్పుడు ధనాధిక్యతనో ప్రకటించుచుండిరి. ఎచ్చటజూచినను సంతోషముతో గూడినముఖములే! ఎచ్చటవినినను బ్రాందిబుడ్ల చప్పుళ్ళే!! ఏవితినినను మాంసముకలిపినవస్తువులే!! ఎవరు చెల్లించినను గినీలే!!!

ఈహోటలు జగత్ప్రఖ్యాతినిగాంచిన తాజ్ మహాలుహోటలని చెప్పవలయునా? కష్టపడి రొక్కమును గడించు సాధారణ హైందవులిందు భుజించుట కసమర్థులుగాన పిత్రార్జితము మెండుగాగల భారతీయు లిందలి రుచులను జవిచూచుచుందురు. నిజమే! ఒకరిసంపాదనను ఖర్చుపెట్టుటతిసులభముగదా!

ఈమందిరమునందొక విశాలమైనగదిలో నలుగురుయౌవనహైందవులు గూరుచుండిరి. ఇందిద్దరు భాగ్యవంతులయిన మేనత్తలనుగలిగి వారికి వారసులయినట్టివారు. హోటలులో కావలసినవస్తువుల కింగ్లీషుపేరులను బహుకాలపరిచయమువలన నేర్చుకొనుటయే వారికున్న ఇంగ్లీషువిద్యాపాండిత్యము. మూడవవాడు అవివేకపు తండ్రి నత రాముండిన నెలకు బంపుసొమ్ముతో పూలరంగనివలె బొంబాయినగరమందు గాలక్షేపము జేయుచున్నట్టివాడు ముప్పది సంవత్సరములకు బయిగా ఈడుగల మహాత్ముడు. ఇక నాలుగవవాడే మనకథానాయకుండగు దినకరరావు. ఈతనిపేరు దినకరరావైనను మిత్రులు ముద్దుకై సర్దారనిపిలుతురు. సర్దారుయొక్క బాహ్యవేషములనుజూచినవారు నిరభ్యంతరముగా నట్టిపేరునకర్హుడనియే చెప్పితీరగలరు. వానిసుందరమైన మహారాష్ట్రవీరులంబోలిన ముఖము, చక్కనిమీసములకట్టు, విశాలమైన నేత్రములు, పటుత్వముయిన శరీరమును జూచినవారు సర్దారని పిలువక మరేమనిపిలువగలరు! కాని దినకరరావుయొక్క గొప్పతనమంతయునాతని పైవేషమునందు మాత్రమేగలదని వ్రాయుటకు చింతించుచున్నాను. ఇంక మొదటి యిద్దరు పడుచువాండ్రును బ్రతిదినమును మొమ్మాదేవికి జేయు ఒక్కప్రార్థన యేదనగా ఎప్పుడత్తలుజచ్చెదరా, ఎప్పుడాస్తివశమగునా తల్లీ యని! మూడవవానికి తండ్రిచావవలయునని లేకున్నను ప్రతినెలయు జేతికందవలసిన మనీఆర్డరాలస్యముగా జేరినప్పుడు ముసలిముండవాడింతకాలమేల బ్రతుకవలయునురా శంకరా యని పండ్లుపటపటకొఱుకుచుండును. నాలుగవవాడగు మనసర్దారుకు నెలకుపోలీసు సబ్ ఇన్స్పెక్టరుగా వచ్చుజీతము తప్ప ఒక్కపగులగొట్టిన గవ్వయయినను పిత్రార్జితములేదు. వానిజీతము వానికిసరిపోదు. కాని వీనిపూర్వులువారిదినములలో గొప్పరణశూరులని ఖ్యాతివహించి పేష్వాలపక్షమునబోరి దేశమునకు సేవచేసినట్టివారు. వారార్జించిన జాగీరులన్నియు దినకరుని తండ్రికాలమునాటికే ఎక్కడివక్కడ సర్దుకొనినవి. దయగల బ్రిటిషుగవర్నమెంటువారాయనకొక పోలీసుఇన్స్పెక్టరుద్యోగము నిచ్చుటవలన, దానివలన వచ్చు స్వల్పాదాయముతో దనపూర్వులవలెనే జీవింపబోయి అప్పులపాలయి, ఏమున్నను, ఏమిలేకపోయినను, దనపూర్వులకందరికినిజన్మమొసంగిన స్వగృహమునునయితము గోల్పోయి, మృతినొందునప్పటికి దినకరరావును నిస్సహాయునిగా జేసిపోయెను. దినకరరావుకున్న యిద్దరు చెల్లెండ్ర కట్టి

ట్లో బంధువులు పెండ్లిచేసి వారినిభర్తలయింటికి సాగనంపిరి. ఈతనితల్లి యొక్క అర్ధెకొంపలో దక్కనులో నొక గ్రామమందుపడియున్నది. వీని తండ్రియందు గౌరవము గలయొకదొరగారు వీనికి సబ్ఇన్‌స్పెక్టరుపని నిప్పించెను. సర్దారుయొక్క నిజస్థితి యిట్టిదైనను దనపూర్వుల నామమును ధరించుచున్నవాడగుటచే వారి పౌరుషమునుగాక పోయినను వారిడాబుడంబములను మాత్రము విడిచిపెట్టలేదు.

నేడుమహారాష్ట్ర సంవత్సరాది పండుగయగుటంజేసి బొంబాయిలోని తనముఖ్యస్నేహితులలో ముగ్గురుని ఈహోటలులో విందుకై పిలిచెను. కన్నతల్లి అన్నములేక మాడుచుండగా నీనిర్దయుని కామాటయే మనస్సునకు బట్టలేదుకాని తానాదినము మార్వాడీవాని వద్దనుండి అప్పుగాబుచ్చుకొనిన యేబదిరూపాయలను బొంబాయిలో బ్రహ్మాండమగు న భోజనమందిరమునందు పాడుచేయుటకు మాత్రము వెనుకదీయు లేదు. ఈసొమ్ము వాని తల్లికి బంపియుండినయెడల నాపెకారు మాసముల గ్రాసమునకు సరిపోవునుగదా?

«అహో, ఈవేళ ఏమయినదో తెలుసునా. ఆమార్వాడీ పిసినారి గాడిద 15 దినములు తెగత్రిప్పి ఈనెల జీతమంతయు వ్రాసియివ్వనిది అప్పుగా నేబదిరూప్యము లీయననెను. నాకప్పుడెంతకోపము వచ్చినదో ఏమిచెప్ప గలను. నాపూర్వుల దినములలోనైనచో వానినిచెట్టుకు వ్రేలాడగట్టి పేముబెత్తముతో చెండాడియుండకుందునా. ఇది పాడుబ్రిటిషుగవర్నమెంటు. సాక్షులు, ప్లీడర్లు, లాలు, మేజస్ట్రేటులు, అపీలులు ఇంకనెన్నో వల్లకాటిలోనివి గలవు. ఇంతజేసినను సుఖముగా జెయిలులో తినమనిశిక్ష. ఈబ్రిటిషు ప్రభుత్వమువారి అమితదయవలెనే వారిరాజ్యము పోవునని నాకు తెలుసును.» అని సర్దారననెను.

«ఓహో, పోలీసు సబ్ఇన్‌స్పెక్టరుగారా ఈమాటలనవలసినది» అని మొదటి స్నేహితుడు హేళనము జేసెను.

«ఫర్వాలేదులే. మనము మరాఠీలో మాటలాడుచున్నాము. ఈతెల్లదొరలకు మనగొడవ ఏమి తెలియగలదులే. అయినను ఈపాపిష్టిరోజులలో గోడలకుచెవులున్నవి. ఆ రవ్వంత యుద్యోగముపోయెనా భవతీ భిక్షాం దేహి అనుచు బయలుదేరవలసినదే. అనిసర్దారు మారు వల్కెను.

«అయితే మార్వాడీవాని సంగతేమయినది»

«ఇంకేమున్నది. ఇది బ్రిటిషుప్రభుత్వము కాదు. కానిమార్వాడీ ప్రభుత్వము. క్లో కై అంటే దస్త్రము కట్టలు. స్మాలుకాజు కోర్టులు, డిక్రీలు, వారంటులు, జప్తులు. కావలసినన్ని పాడుపీడలు. జీతమువ్రాసియిచ్చి రూపాయికి పండ్రెండణా లేపుచ్చుకొంటిని.

«వడ్డీయో»

«నెలకు రూపాయికి ఒకఅణా»

«ఇంతకష్టపడి యీవిందుమాకెందుకు»

«అబ్బో, ఎంత కనికరము! మీతావున సొమ్మేడ్చినట్లు. ఆ అత్తముండలిద్దరు చచ్చినప్పుడుగదా మనమందరము భాగ్యశాలులము» అని దినకరు డత్తిపాడిచెను.

«అట్లయినచో, సర్దారూ, అప్పులుపెట్టిన మార్వాడీవాండ్రందరిని ప్లేగుపట్టుకొని పీకి దిగమ్రింగునుగాక» యని రెండవస్నేహితుడు దొరలుపోయువిధమున సారాయిని గ్లాసులోబోసి ఒకక్షణములో కడుపులోనికి జారవిడిచెను. దీనినేఆంగ్లేయులు «డ్రింకింగ్ డిటోస్టు» అనిఅందురు.

ఇట్టి సరససల్లాపములలో నారితేరినవాడు గాన సర్దారు «మనతోవకడ్డమున్న ముసలి అత్తముండలుత్వరగా జచ్చెదరుగాక» యని గ్లాసును ద్రాక్షసారాయితో నింపి లోపలికి జారవిడిచెను. అందరును ఇట్టిసమయోచిత సంభాషణమునకై పకపకనవ్విరి. అంతట ఈనలుగురి స్నేహితులయొక్క ధోరణియు గుఱ్ఱపుబండ్లు, మోటరుబండ్లువారుముందు నివసింపదలచిన సుందరమందిరములు, నాటకములు, గుఱ్ఱపుపందెములు, లాటరీలు, అన్నిటికంటె ముఖ్యముగా స్త్రీలు మొదలగువానిమీద మరలెను. ఈసంగతులలో నందరును విశారదులవలెనే మాటలాడిరి. ఈనలుగురినోటిలో గొప్పయుద్యోగీయు లందఱును లంచగొండులయిరి. గొప్పసత్పురుషుల కీర్తియంతయు వినాశమయినది. మహాపతివ్రతలగు స్త్రీలునయితేమీ

వ్యభిచారిణులు కాగా సాధారణస్త్రీల సంగతి యేమని వ్రాయనేల? వారుత్రాగినపదార్థము వారినాలుకలను విచ్చలవిడిగా వదలివేసెను.

ఆహా! అనిందింపబడినయుద్యోగులుగాని, స్త్రీలుగాని పురుషులుగాని ఆ గదిలో ఆసమయమందుండి వినినచో ఎవరివో కొందరివి ప్రాణములు పోయి యుండవలసినవే గదా?

ఇంతలో నొక భోజనగృహసేవకుడువచ్చి “దేవరా, తమకొరకెవరో వచ్చినారండి” యని సర్దారుతో మనవి చేసెను.

“ఎవడో వానిని ఇక్కడకు రమ్మనుము. నేను లేచి వెళ్ళి చూచుస్థితిలో లేను”

“చిత్తమండి”

అంతట సర్దారుయొక్క ఆర్డర్లీపోలీసుకాన్‌స్టేబిలు లోపల ప్రవేశించెను.

“ఏమోయి, ఏమిమునుంచుకొని పోయినదనియిచ్చటికి పరుగెత్తుకొనివచ్చినావు” అనియజమాని యడిగెను.

“చిత్తమండి, శ్యాముకొనమనినపండ్లు, సారాయి బుడ్లు, పుష్పహారములు, పెద్దదొరగారికి బంపుటకయి తెచ్చినానండి”

“ఓహో, ఇదియొక పనితగలబడినదే, యీపూట. మనపండుగ మనకుగాని మనదొరల కెందుకీబవాలుమతులో. ఇది డిపార్టుమెంటులో లేనిపోనిపాడురివాజు.” అని విసుగుతో సర్దారు పలికి “సరే, విక్టోరియానొకటి బాడుగకు గుదిర్చిఅందు నీవు తెచ్చినసామానులను బెట్టికూర్చునుము. నేను తరువాతవచ్చెదను.” అని కాన్‌స్టేబిలును వెళ్ళమనెను. కానివాడు కదలలేదు.

“పోవేమి, అటుయిటు ఏలచూచెదవు. జన్మములో ఇట్టియింటిని జూడలేదుకాబోలును”

“కాదండి, తమకొకయుత్తరము వచ్చినదండి”

“ఇటులపారవేసిపో,” అని సర్దారు గర్జింపగా దానినిచ్చి కాన్‌స్టేబిలు నడచిపోయెను. ఈయుత్తరము జదువగానే సర్దారుయొక్క ముఖము వెలవెల బోయినది. తన స్నేహితులు లాగుకొని చదివి నవ్వెదరని నెమ్మదిగా దానిని క్రిందికిజారవిడిచి బూట్సుకాలు క్రింద నణచియుంచెను. ఇంతలో నలుగురు స్నేహితులును, మూడునాలుగువైను బుడ్లను త్రాగి ఖాలీచేసిరి. తరువాతసిగరెట్లవాసనలతో గది యంతయు నిండియుండెను. దినకరరావుకునిషా హెచ్చినది. అట్టిసమయమునందెట్టి మధురభాషణలు నోటినుండివచ్చునో మనకందరికిని దెలుసును గాన విస్తరించి వ్రాయనవసరములేదు. ఏలాగునో హోటలులోని నౌకరులసహాయ్యమువలన ఆనలుగురును అద్దెబండ్లలోబడి వారివారి యిండ్లకుజేరిరి.

వీరువెళ్ళినతరువాత ఆగదినూడ్చుటకయి వచ్చిన యొకపనికత్తెకొకయుత్తరము దొరికినది. దానినిదీసుకొని వెళ్ళి ఆస్త్రీయొకగుమాస్తాకిచ్చెను. ఆయుత్తరమునందు అయిదురూపాయల నోట్లురెండును, తెల్లతెల్లబోయిన సిరాతో నొకస్త్రీవలన వ్రాయబడిన మరాఠీయుత్తరమునుగలవు. ఆయుత్తరములో నిట్లున్నది.

“నాముద్దులబిడ్డా,

నీవు చెప్పిన ప్రకారము చేసితిని. నేచేసినపనికి నీవుముందెన్నడును తప్పులు పట్టకుందువుగాక. ఏమున్నను ఏమిపోయినను మనపూర్వులతి భద్రముతో వంశధనముగ కాపాడుకొనుచున్న పేష్వాబాజీరావిచ్చిన అమూల్యధనమును నేటికి మన హయాములో బోగొట్టుకొనవలసివచ్చెనుగదాయని దుఃఖించుచున్నదానను. నేజేసిన యీమహాపరాధమునకయి వారుదయ్యములై నన్ను బట్టుకొనకుందురుగాకయని భవానీతల్లికి మ్రొక్కుచున్నాను. అయినను నాతప్పేమికలదు? నీ విప్పుడింటికి పెద్దవుగదా? నేనాడుదానిని. నీయిష్టప్రకారము జేసితిని. ఆవీరఖడ్గమునకు బంగారుపూతయు, కెంపులును ఉన్నను కాబూలీవాడు ప్రాతవడి పోయినదని 50 రూపాయలకెక్కువసొమ్మియ్యలేదు. వీనితప్ప మరెవ్వడును దానిని గొనలేదు. రహస్యముగా కొంగులో దాచుకొని రాత్రిపూటవానియింటికొకత్తెని దీసుకొనివెళ్ళుచుండగా నింకొక దారిని భవానీ దేవాలయమునకుబోయి అచ్చటనేల యీఖడ్గముతో అమాతయెదుట నాదరిద్రపుప్రాణమును త్యజింపరాదనిపలుమారు అనుకొంటిని. ఇంతలో భవానీయా

లయమెదుటనే నిలిచినట్లు గనుగొంటిని. కాని, ప్రియకుమారా! నీయవసర మెట్టిదో, ఏమియిబ్బందిలో నీవున్నావో అని తల్లి నగుటచే భీతిల్లి ఈపాడుప్రాణములను నీయందలిప్రీతిచేత బోగొట్టుకొనక ఆకాబూలీవాని గృహమునకే వచ్చినదానిని వెళ్ళితిని. నేను మహారాష్ట్రస్త్రీలలో వీరాగ్రగణ్యుల కులమునందు జన్మించినదానను. కాబూలీవానియింటికి రాత్రిపూట వెళ్ళుట. ఏమి ఘోరము! అహా, ఎంతమానమును విడిచితిని!! పూర్వపు వీరనాయికలిట్లు జేయుదురా? కాని యిదంతయు నీకొఱకేనను మనశ్శాంతిని గలిగి యుంటిని. వాడిచ్చిన యేబది రూప్యములలో నయిదు సత్తువి. నాకారాత్రి సత్తువేమిటో మంచివేమిటో జూచునంతనిబ్బరము లేకపోయెను. ఎవరితో నేమి ఇట్టిమోసమును గుఱించి చెప్పినను మనపరువుపోవునని కుక్కిన పేనులాగూరకుంటిని. నాయనా, నాదురదృష్టమింతటితో దీరలేదు. ఏలాగుననో నావద్ద రూపాయలున్న సంగతి బియ్యపువానికిని, ఇంటివానికిని, గుడ్డలిచ్చినవానికిని, పాలవానికిని, దెలిసి వారి వారి సొమ్మియ్యమని బాధపెట్టిరి. వారినిబంపివేయుటకు దీర్ఘకాలపు టప్పులగుటచేత ముఖము జెల్లక ముప్పదిరూపాయలిచ్చి పంపివేసితిని. నీకుబంపవలసినసొమ్ములో దక్కువయయినను, నాయబ్బా, నేను ఋణవిముక్తనై నిబ్బరముగా నిద్రింపజాలినందునకు నీవయినను సంతోషింపకుందువా? అయ్యో! దేవుడా! సుఖమైననిద్రా, యీపాపికి!! అట్టి వంశధనమును యమ్మిన పాపిష్టిదానికి సుఖనిద్రపట్టునా. ఆఖడ్గము చేతినుండిపోయి నను హృదయములో జేరిపొడుచుచున్నది. కుదువయయిన ఖైట్టకేలయమ్మితిని? అప్పుడు నీవుపంపమనిన యేబది రూప్యములను తాకట్టుక్రింద నీయననినాడు. ఇకమిగిలిన యిరువది రూప్యములును నీకుబంపవలయు ననుకొంటిని. ఇంతలో సంవత్సరాది పండుగ యగుటవలనను, వారును నీవలెనే నాకడుపున బుట్టినవారగుటచేతను, అత్తవారిండ్లకు బంపినదిమొదలు ఒక్కపండుగకైనను బిలిచి యింతపసుపు కుంకుమ మనమింతవఱకు బెట్టనందువలనను, ఇదియే నాకడపటి సంవత్సరాది పండుగయని నాదృఢనమ్మకమగుటచేతను, ఇకదిరిగివారినీలోకములో బిలిచి పెట్టబోనుగదాయని చెరియయిదురూపాయల చీరెలను గొనిపంపితిని. నీముద్దుచెల్లెండ్రకిట్లు పంపినందునకైనన్ను శపించకుందువుగాకయని వేడుకొనుచున్నాను. నాకును గట్టిబట్టలు లేవు అన్నియు చినుగులే. అతుకులు వేసుకొని కాలక్షేపము జేయుచున్నాను. నేనుమూడు రూపాయలకయినను ఒక్కచీరెను కొనుక్కొనవలయుననుకొంటిని. కాని నీస్వభావము నెఱుగున్నదాననగుటవలన ఇప్పటికే ఆగ్రహపడుదువను భయముచేత నాకొఱకయిచీరెను కొననయితిని. మిగిలిన అయిదురూపాయల రెండు నోటుల నిందుతో జతపఱచిపంపితిని. నాయనా, ఈపదిరూపాయలతో సంవత్సరాదిపండుగకు క్రొత్తబట్టలను కొనుక్కొనుము. వానిని కట్టుకొనునప్పుడు ఒక్కసారియయినను నీప్రియమయిన తల్లిని తలంచుకొంటివేని ఆపె కృతకృత్యురాలు.

బొంబాయివంటి మహానగరములో పదిరూపాయలొక లెక్కలోనివికావు. నీ వనేకపర్యాయము లనునట్లు అవి "వెధవపదిరూపాయలే" కాని, నాపట్టీ, సర్కారువారిచ్చుచున్న ఆరురూపాయల వితంతువుల పింఛనులో నెలకు సగముభాగము మూడురూపాయలు నీకుబంపుచు మిగిలిన మూడురూపాయలతోనే ఈపాడుకడుపు దినములలో బ్రతికియు బ్రతుకక, చచ్చియు చావక, కాలక్షేపము జేయుచున్న నీతల్లి అట్టినిందార్హురాలుకాదని నీయంతరాత్మ చెప్పకపోవునా?

తండ్రీ, నేను చేసినదానిలో నేదయిన తప్పున్నచో నన్ను క్షమింపుము. దేవుడు నిన్నెల్లప్పుడును రక్షించుచుండునుగాక! నేనుచచ్చిపోవులోపల ఒక్కసారయినను వచ్చిచూచి ముద్దిచ్చెదవేని శాంతముతో జచ్చిపోగలను.

ఇట్లు,

నీప్రియజనని.

సమాప్తము.

అమృతాంజనము నొప్పులకు దివ్యామృతము.